

సోమశిలలో 72.809 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో ఆదివారానికి 72.809 టీఎంసీలు ఉన్నాయి. ఎగువ నుంచి 3,550 క్యూసెక్కుల వరద వస్తోంది. డెల్టాకు 1550, ఉత్తర కాలువకు 600, కండలేరుకు 1200, దక్షిణకాలువకు 150 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.78,930
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.7,140
3 శాతం జీఎస్టీతో	రూ.7,354
నవర (8 గ్రా)	రూ.58,832

గరిష్టం/కనిష్టం
30.7 /23.5

వాతావరణం

జిల్లాలో సోమవారం వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు క్షీణించడంతో చలితీవ్రత పెరుగుతోంది. ఆదివారం గాలిలో తేమ 72 శాతంగా ఉంది.

న్యూస్‌రీల్

సామాజిక చైతన్యం పెంపొందించుకోవాలి

- ఎమ్మెల్సీ ఐ. వెంకటేశ్వరరావు



ర్యాలీ నిర్వహిస్తున్న యూటీఎఫ్ నాయకులు

నెల్లూరు (టౌన్): యూటీఎఫ్ కార్యకర్తలు వ్యక్తిగత, సంఘ చైతన్యం కలిగి ఉండడంతో పాటు సామాజిక చైతన్యం పెంపొందించుకోవాలని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఐ. వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక కస్తూర్బా కళాక్షేత్రంలో యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభ జరిగింది. తొలుత వీఆర్సీ నుంచి కళాక్షేత్రం వరకు ర్యాలీ, అనంతరం పతాకావిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న విషయాలపై నిరంతరం అధ్యయనం చేస్తుండాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ యూటీఎఫ్ ఏర్పడి 50 ఏళ్ల కాలంలో ఉపాధ్యాయ వర్గానికి అనేక సదుపాయాలను కల్పించడంతోపాటు విద్యారంగ అభివృద్ధికి కృషి చేసిందన్నారు. జిల్లా ఉద్యమంలో పనిచేసిన సీనియర్ నాయకులను ఘనంగా సన్మానించారు. జిల్లా స్థాయి ఆటల పోటీలు, సాంస్కృతిక రంగంలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు ఎస్.వెంకటేశ్వర్లు, మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాబురెడ్డి, సీనియర్ నాయకులు మస్తాన్‌రావు, పరంధామయ్య, శ్రీహరి, కొండాచారి, రమణయ్య, మస్తానయ్య, సుబ్బారావు, కృష్ణ, నవకోటేశ్వరరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి శేషు, చలపతిశర్మ తదితరులు పాల్గొన్నారు.

ట్రెజరీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- ఏకగ్రీవంగా ఖజానా శాఖ ఉద్యోగుల రాష్ట్ర కమిటీ



ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన రాష్ట్ర ఖజానా శాఖ ఉద్యోగుల కమిటీ

తిరుపతి అర్బన్ : ఖజానా శాఖ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర కమిటీ నేతలు డిమాండ్ చేశారు. తిరుపతి–కరకంబాడీ మార్గంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో ఆదివారం రాష్ట్ర స్థాయి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్ర స్థాయి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. రాష్ట్ర అధ్యక్షుడిగా గోవిందు రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా కాజ రాజ్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగుల పదోన్నతికి ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలకు ప్రభుత్వం పరిష్కారం చూపిస్తే తాము ప్రభుత్వానికి సహకరిస్తామన్నారు. అసోసియేషన్ రాష్ట్ర సహాధ్యక్షుడిగా కె. శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా కరిముల్లా, కార్యనిర్వాహక కార్యదర్శిగా బి. శ్రీనివాసరావు, కోశాధికారిగా యుగంధర్‌తోపాటు ఏడుగురు ఉపాధ్యక్షులు, ఏడుగురు కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు.

కంభం సీఐ ఫోన్ హ్యాక్

కంభం: ప్రకాశం జిల్లా కంభం సీఐ ఫోన్, వాట్సప్ హ్యాక్ అయినట్లు ఎస్సై నరసింహారావు తెలిపారు. సీఐ వాట్సప్ నుంచి వచ్చిన మెసేజీలను ఎవరూ ఓపెన్ చేయవద్దని, పొరపాటున ఓపెన్ చేస్తే మీ ఫోన్‌లోని డేటా, బ్యాంక్ ఖాతాల్లోని నగదు పోయే అవకాశం ఉందన్నారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలని కోరారు.

లారీని ఢీకొన్న కంటైనర్



కావలి: మండలంలోని రుద్రకోట వద్ద చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని కంటైనర్‌ను ఢీకొన్న ఘటన ఆదివారం జరిగింది. జామాయిల్ కర్ర లోడుతో ఒంగోలు నుంచి నెల్లూరుకు వెళ్తున్న లారీ పొగమంచు కారణంగా ముందుకు వెళ్లలేని పరిస్థితిలో డ్రైవర్ వాహనాన్ని రోడ్డు మార్జిన్‌లో నిలిపేశాడు. ప్రకాశం జిల్లా చీమకుర్తి నుంచి చెన్నై పోర్టుకు గ్రానైట్ లోడుతో వెళ్తున్న కంటైనర్ ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. దీంతో లారీ మార్జిన్‌లోకి బోల్తాపడింది. కంటైనర్ ముందు భాగం నుజ్జునుజ్జు అయింది. కంటైనర్ డ్రైవర్ జయబాలు తీవ్రంగా గాయపడ్డాడు. డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం 108 వాహన సిబ్బంది కావలి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆ సీటు..భలే హాటు

- రూ.కోట్లు పలుకుతున్న కావలి సబ్ రిజిస్ట్రార్ పోస్టు
- దానికి వేలం పెట్టిన ప్రజాప్రతినిధి
- రూ.2 కోట్లు ఇచ్చేందుకు ముందుకు వస్తున్న అధికారులు
- విధుల్లో ఉన్న ఎస్ఆర్‌ను సెలవుపై వెళ్లిపోవాలని బెదిరింపు
- తాను వెళ్లేది లేదంటున్న సబ్ రిజిస్ట్రార్
- ఏసీబీ కేసులో ఇరికిస్తారన్న భయంతో లంచం ఇవ్వద్దంటూ బోర్డు పెట్టిన సబ్ రిజిస్ట్రార్
- జిల్లాలో చర్చనీయాంశమైన కావలి వ్యవహారం



కావలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వేదికగా అధికారానికి, అహంకారానికి మధ్య ప్రచ్ఛన్న యుద్ధం జరుగుతోంది. లంచం లేనిదే సంతకం పెట్టని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో లంచాలకు తావులేదంటూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ కావలిలోనే కాక, ఆ శాఖలో చర్చనీయాంశమైంది. ఈ శాఖలో అవినీతికి తావులేదని చెప్పిన ఆ ప్రజాప్రతినిధే.. మూడు నెలలు తిరగక ముందే ప్లేటు ఫిరాయించి ఆ పోస్టుకు బహిరంగ వేలం పెట్టడంతో సబ్ రిజిస్ట్రార్ వర్సెస్ ప్రజాప్రతినిధిగా మారింది. సెలవు పెట్టి వెళ్లిపోవాలని.. లేదంటే ఎలా పనిచేస్తావో చూస్తానన్న సదరు ప్రజాప్రతినిధిని ధిక్కరించి.. ఆ సబ్ రిజిస్ట్రార్ తన పలుకుబడితో అదే సీటులో కూర్చొని పనిచేస్తున్నారు.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: కావలి సబ్ రిజిస్ట్రార్ సీటు.. భలే హాటుగా మారింది. ఈ పోస్టు వ్యవహారం జిల్లాలో హాట్‌టాపిక్ అయింది. అధికారం, రాజకీయం ఆధిపత్యం కొనసాగుతోంది. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో దళారీ వ్యవస్థ ద్వారా అదనపు వసూళ్లు లేకుండా కాగితం కదలని పరిస్థితి. అలాంటి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట లంచాలకు తావులేదని, ప్రభుత్వ రుసుములు చెల్లిస్తే చాలని ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ పెద్ద సంచలనంగా మారింది. నిత్యం క్రయవిక్రయాల్లో రూ.లక్షల్లో చేతులు మారే కార్యాలయంలో ఉన్న పళంగా ఫ్లెక్సీ ఏర్పాటు చేయడం వెనుక పెద్ద కథే నడిచింది. ఈ వ్యవహారం వెనుక అధికారి నిజాయితీ ఉందనుకుంటే పొరపాటే. రూ.కోట్లు పలికే ఆ పోస్టులో సదరు ప్రజాప్రతినిధిని ధిక్కరించి కూర్చొన్న సదరు మహిళా అధికారి భవిష్యత్ ప్రమాదానికి భయపడి ఆ బోర్డు ఏర్పాటు చేసినట్లుగా చర్చ సాగుతోంది.

నెలకు రూ.50 లక్షల ఆదాయం

జిల్లాలో నెలవారీ ముడుపుల ఆదాయంలో నెల్లూరు తర్వాత కావలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయమే. కావలి చుట్టూ రామాయపట్నం పోర్టు, పోర్టు ఆధారిత పరిశ్రమలు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్, దగదర్తి విమానాశ్రయం ఇలా పారిశ్రామికంగా అభివృద్ధి వైపు దూసుకుపోతున్న కావలిలో రియల్ ఎస్టేట్ రంగం ఉవ్వెత్తున ఎగిసి పడుతోంది. ఈ ప్రాంతంలో భూ క్రయవిక్రయాలు జోరుగా సాగుతున్నాయి. అయితే భూ వివాదాలు ఉన్న ఈ ప్రాంతంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కీలకంగా మారింది. నిబంధలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్ చేస్తే రూ.లక్షల్లో ముడుపులు అందుతాయి. నెలవారీగా సబ్ రిజిస్ట్రార్ ఆదాయం రూ.50 లక్షలకుపై మాటే ఉంటుందని సమాచారం. ఈ క్రమంలో కావలి సబ్‌రిజిస్ట్రార్ పోస్టుకు భలే డిమాండ్ ఏర్పడింది. అయితే ఈ దఫా సాధారణ బదిలీల్లో భాగంగా ఉన్నతాధికారులను మేనేజ్ చేసుకుని ఓ మహిళా అధికారి ఈ పోస్టును పట్టేసింది. స్థానిక ప్రజాప్రతినిధి సిఫార్సు లేఖ లేకుండానే ఆ పోస్టులో కూర్చొంది. రెండు నెలల పాటు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో కాసులు గలగలాడాయి. దీంతో ఆ పోస్టుపై కన్నేసిన ప్రజాప్రతినిధి సదరు అధికారిణి దందా వ్యవహారంపై ఉన్నత స్థాయికి తీసుకెళ్లడం, ఆమె కొద్ది రోజులు సెలవుపై వెళ్లడం చకచకా జరిగిపోయాయి.

పోస్టుకు బహిరంగ వేలం..

కావలి సబ్‌రిజిస్ట్రార్ సెలవుపై వెళ్లడంతో ఆ పోస్టుకు డిమాండ్ పెరిగింది. దీంతో సదరు ప్రజాప్రతినిధి ఈ పోస్టుకు వేలం పెట్టినట్లు తెలుస్తోంది. నెలవారీగా రూ.లక్షల్లో ఆదాయం వచ్చే ఆ పోస్టుకు గతంలో పని చేసిన ఓ అధికారి, నెల్లూరులో పనిచేసి వెళ్లిన మరో అధికారి పోటీ పడుతున్నారు. రెగ్యులర్ పోస్టు అయితే.. రూ.2 కోట్లు ఇవ్వడానికి సిద్ధమని చెప్పినట్లు సమాచారం. ప్రస్తుతం బదిలీలపై నిషేధం ఉండడంతో డిప్యుటేషన్‌పై వచ్చేందుకు అధికారులు పోటీ పడుతున్నారు. రూ.కోటి వరకు బేరం కుదిరింది. లోకల్ ప్రజాప్రతినిధి సిఫార్సు లేఖతోపాటు రిజిస్ట్రేషన్ శాఖ రాష్ట్ర కార్యాలయంలో భారీ ఆఫర్లతో పోస్టు కోసం ఎగబడుతున్నారు. దీంతో ఈ వ్యవహారం వెలుగులోకి రావడంతో తన పోస్టుకు ఎసరు పెడుతున్న విషయాన్ని తెలుసుకున్న సదరు అధికారిణి జిల్లాకు చెందిన ఓ మంత్రి ద్వారా ఉన్నతాధికారులకు రెకమెండ్ చేయించుకుని వెను వెంటనే విధుల్లో జాయిన్ అయిపోయింది. అధికారంలోకి వచ్చిన వెంటనే కార్యాలయాన్ని సందర్శించిన సదరు ప్రజాప్రతినిధి ఇక్కడ అవినీతికి తావులేకుండా రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చని చెప్పారు. మూడు నెలలు తిరగక ముందే ఆ పోస్టుకు వేలం పెట్టడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



కావలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతికి తావులేదంటూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

సీటు వదలాల్సిందే.. కదిలే ప్రసక్తే లేదు..

కావలి సబ్‌రిజిస్ట్రార్‌గా విధుల్లో జాయిన్ అయిన అధికారిణి స్థానిక ప్రజాప్రతినిధి వద్దకు ఇతరులను రాజీ రాయబేరానికి పంపించారు. అయితే ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్న ప్రజాప్రతినిధి ఆమె ఆ సీటులో ఎన్ని రోజులు కూర్చుంటుందో నేను చూస్తానంటూ బెదిరింపులకు దిగారు. ఆ సీటు వదలాల్సిందేనని సదరు ప్రజాప్రతినిధి హుంకరిస్తుంటే.. కదిలే ప్రసక్తే లేదంటూ సబ్ రిజిస్ట్రార్ మొండికేస్తున్నారు. అధికారి, ప్రజాప్రతినిధి మధ్య జరుగుతున్న ప్రచ్ఛన్న యుద్ధంలో రాజకీయంగా ఉచ్చు బిగిసే అవకాశం ఉండడంతో ఆ సబ్ రిజిస్ట్రార్ ముందు జాగ్రత్తలు తీసుకుంటూ ఆ ప్రజాప్రతినిధికే సవాల్ విసురుతూ ఎదురొడ్డుతున్నారు. ఈ క్రమంలో ఏసీబీని అస్త్రంగా ఉపయోగించుకునే అవకాశం ఉందని భావించిన సదరు అధికారిణి కార్యాలయంలో ఫ్లెక్సీ ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఇందులో ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఫీజు, చలనాలు మాత్రమే చెల్లించాలని, దళారులకు ఒక్క రూపాయి కూడా అదనంగా ఇవ్వొద్దని బోర్డు పెట్టించడమే కాకుండా క్రయ, విక్రయ దారులను ఎవరికి అదనపు రుసుములు చెల్లించవద్దని పదేపదే విజ్ఞప్తి చేస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారం ఆ కార్యాలయ ఉద్యోగులకు నచ్చడం లేదు. రూ.లక్షలు వెచ్చించి కావలి కార్యాలయానికి బదిలీపై వస్తే లంచాలు రాకుండా ఆమె వ్యక్తిగత స్వార్థం కోసం తమకు వచ్చే ఆదాయాన్ని అడ్డుకుంటుందని ఉద్యోగులు మండిపడుతున్నారు. గతంలో ఉమ్మడి నెల్లూరు జిల్లా, గుంటూరు జిల్లాలో పనిచేసిన సదరు అధికారిణిపై అనేక ఆరోపణలున్నట్లు ఆ శాఖలో ప్రచారం జరుగుతోంది. అలాంటి అధికారిణి కావలికి వచ్చేసరికి ఇలా బోర్డులు ఏర్పాటు చేయడంపై ఆ శాఖలోనే హాట్ టాపిక్‌గా మారింది.

బెల్టు షాపులను ప్రభుత్వమే ప్రోత్సహిస్తోంది



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్

- సీపీఎం జిల్లా కార్యదర్శి కటారి అజయ్‌కుమార్

ఉదయగిరి: రాష్ట్రంలో ప్రభుత్వమే మద్యం బెల్టు షాపులను ప్రోత్సహిస్తూ పేద ప్రజల జీవితాలను నాశనం చేస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి కటారి అజయ్‌కుమార్ ఆరోపించారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ఆదివారం సీపీఎం నేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్టీఆర్ హయాంలో మద్య నిషేధంతో పేద కుటుంబాలు బాగుపడితే, ఆ తర్వాత సీఎంగా చంద్రబాబు మద్య నిషేధం ఎత్తివేసి లిక్కర్ మాఫియాకు అండగా నిలిచారని మండిపడ్డారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వం ద్వారా మద్యం అమ్మకాలు జరపగా, ప్రస్తుత ప్రభుత్వం మద్యం ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించి బెల్టు దుకాణాల ద్వారా పల్లెల్లో మద్యం ఏరులై పారిస్తున్నారన్నారు. కూలీనాలీ చేసుకొని సంపాదించిన నగదును మద్యానికి బానిసలై ఖర్చు చేస్తున్నారన్నారు. గతంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించిన చంద్రబాబు, లోకేశ్ ఇప్పుడు వారే ఆ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారని దుయ్యబట్టారు. విద్యుత్ చార్జీలు విపరీతంగా పెంచి ప్రజలపై భారం మోపుతున్నారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో ఎంతో మంది పేద విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారన్నారు. పేరుకు ఉచిత ఇసుక అని చెప్పినప్పటికీ గత ప్రభుత్వం కంటే రెట్టింపు ధరలకు విక్రయాలు జరుగుతున్నాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయకుండా చంద్రబాబు ప్రజలను మోసం చేస్తున్నాడని విమర్శించారు. బాబుకు వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదన్నారు. ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో నెల్లూరులో నిర్వహించే సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కాకు వెంకటయ్య, కోడె రమణయ్య, ఫర్దిన్‌బాషా, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుది నియంత పాలన

- ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ ఎన్నికలు
- ఇవి ఎన్నికలు కావు.. నామినేటెడ్ ఎంపికలు
- సాగు నీటి సంఘాల ఎన్నికల్లో టీడీపీ నేతల అరాచకం
- అడుగడుగునా అధికార దుర్వినియోగం
- బెదిరింపులు, దాడులు, దౌర్జన్యాలు గెలిచాయి
- తాము బహిష్కరించిన ఎన్నికల్లో గెలిచామంటూ నిస్సిగ్గుగా ప్రచారం
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు (బారకాసు): చంద్రబాబుది నియంత పాలన. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల్లో గెలిచిన చరిత్ర ఆయనకు లేదు. అడ్డదారిలో అధికారాన్ని చేజిక్కించుకోవడమే ఆయన తెలిసిన విద్య. రాష్ట్ర వ్యాప్తంగా సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ ఏకపక్షంగా ఏకగ్రీవంగా జరిగాయి. మేము బహిష్కరించిన ఎన్నికల్లో టీడీపీ నేతలు అడుగడుగునా అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ, దౌర్జన్యాలు, దాడులు, నిర్బంధాలతో ఏకపక్షంగా ఏకగ్రీవాలు చేసుకుని గెలుచుకున్నామంటూ నిస్సిగ్గుగా ప్రచారం చేసుకుంటున్నారు. అని మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి దుయ్యబట్టారు. ఇవి ఎన్నికలు కావని, నామినేటెడ్ ఎంపికల్లా ప్రహసనంగా నిర్వహించారన్నారు. ఆదివారం నెల్లూరులో తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగబద్ధంగా జరపాల్సిన ఎన్నికల ప్రక్రియను ఇష్టారీతిన నిర్వహించారన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు సీక్రెట్ బ్యాలెట్ ప్రకారం ఎన్నికలు జరపకుండా అందుకు పూర్తి భిన్నంగా కూటమి ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు ఏకపక్షంగా నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించారన్నారు. జిల్లాలో పలు ప్రాంతాల్లో భూములున్న రైతులకు ఓట్లు లేకుండా చేశారన్నారు. రెవెన్యూ అధికారులు ఎన్ఓసీలు ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టారని, కొన్ని చోట్ల వీఆర్‌ఓలు అందుబాటులో లేకుండా పోయారని, ఉన్న వారు సంతకం కూడా పెట్టలేదన్నారు. పార్టీలకు అతీతంగా నీటి సంఘాల ఎన్నికల్లో పాల్గొనాలని నిర్ణయించిన తమ పార్టీ సానుభూతిపరులైన రైతులపై దౌర్జన్యాలకు దిగారన్నారు. పోలీసులను ప్రయోగించి తప్పుడు కేసులు పెడతామని బెదిరించడం వంటి చర్యలకు టీడీపీ నేతలు పాల్పడ్డారన్నారు. ఇటువంటి విషయాలను బహిర్గతం చేసేందుకు ప్రయత్నించిన మీడియాపైనా దాడులకు దిగడం ద్వారా కూటమి ప్రభుత్వం అప్రజాస్వామిక విధానాలకు తెగబడుతోందని చెప్పారు. అందుకే ఈ ఎన్నికలను తమ పార్టీ బహిష్కరించిందని, తాము ఎక్కడా జోక్యం చేసుకోలేదని స్పష్టం చేశారు. రైతులకు అన్యాయం జరుగుతుంటే ప్రశ్నించామే తప్ప మరొకటి కాదన్నారు. నీటి సంఘాల ఎన్నికల్లో టీడీపీ నేతలు బెదిరింపులు, దాడులు, దౌర్జన్యాలు గెలిచాయి.

గెలిచిన దళిత మహిళా రైతును ఓడించారు..

ఇందుకూరుపేట మండలం కుడితిపాళెం 12వ టీసీలో జరిగిన ఎన్నికల్లో టీడీపీ నేతలు అరాచకానికి పాల్పడ్డారు. పాపమ్మ అనే దళిత మహిళా రైతు గెలిచినా, టీడీపీ నేత మెట్టా శ్రీనివాసులురెడ్డి గెలిచినట్లుగా అధికారులు ప్రకటించడం సిగ్గు చేటన్నారు. బోగోలు చెరువు నీటి సంఘం ఎన్నికల్లో టీడీపీ నాయకులు బరితెగించారన్నారు. శుక్రవారం అర్ధరాత్రి ఇంట్లో నిద్రిస్తున్న వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు, రైతు దగుమాటి కొండయ్యను డబ్బులు పంచుతున్నారని మీ మీద ఫిర్యాదులొచ్చాయని చెప్పి పోలీసులు వారిని బలవంతంగా స్టేషన్‌కు తీసుకెళ్లి నిర్బంధించారన్నారు. చివరికి కూటమి ప్రభుత్వంలోని బీజేపీ, జనసేన నేతలను కూడా పోటీ చేయకుండా టీడీపీ నేతలు అడ్డుకున్నారన్నారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు ఏ విధంగానైతే నీరు–చెట్టు కింద దోచుకున్నారో ఆదే విధంగా మరో సారి దోచుకోవాలనే ఉద్దేశంతోనే ఇలా వ్యవహరించారని తెలిపారు. నోడ్యూస్ సర్టిఫికెట్లపై తహసీల్దార్ కౌంటర్ సంతకం కావాలని రైతులను, టీడీపీలోని రెబల్ వర్గాలను పోలీసులు అడ్డుకోవడం జరిగిందన్నారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని కర్నూలు సీసీఎస్ సీఐ ఇబ్రహీం 'నీవు మాజీ ఎమ్మెల్యే అయితే నాకేంటి రా అంటూ' దుర్భాషలాడుతూ దురుసుగా ప్రవర్తించడం చూస్తే.. పోలీసులు అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని అర్థమవుతోందన్నారు. అధికారులు దగ్గరుండి చేయించే పొరపాట్లుకు భవిష్యత్‌లో శిక్ష అనుభవించక తప్పదన్నారు. ఎ ఈ ఎన్నికల్లో రైతులపై జరిగిన దాడిని వైఎస్సార్‌సీపీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు.

పొట్టిశ్రీరాములు త్యాగం చిరస్మరణీయం



అమరజీవి పొట్టిశ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించిన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- మాజీ మంత్రి కాకాణి

నెల్లూరు(బారకాసు): ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం అసువులు బాసిన అమరజీవి పొట్టిశ్రీరాములు త్యాగం చిరస్మరణీయమని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. పొట్టిశ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం నగరంలోని డైకస్‌రోడ్డులో ఉన్న కాకాణి తన క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాకాణి మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్రం కోసం అమరజీవి చేసిన ప్రాణత్యాగం వెలకట్ట లేనిదన్నారు. పొట్టిశ్రీరాములు లేకపోతే తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటయ్యేది కాదన్నారు. అమరజీవి భావితరాలు ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

గిరిజనులకు రాయితీ రుణాలు ఇవ్వండి

రేణిగుంట : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులకు సబ్సిడీ రుణాలిచ్చి కులవృత్తులను ప్రోత్సహించాలని ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దినారి ప్రభాకర్ తెలిపారు. ఏకలవ్య ఎరుకుల సంక్షేమ సంఘం కార్యకర్తలతో ఆయన ఆదివారం రేణిగుంటలో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ గిరిజన తెగలో ఎరుకుల కులస్తుల చేతివృత్తులైన బుట్టల అల్లకం, బాతుల పెంపకం, ఉప్పు, పప్పు దినుసుల వ్యాపారం, సోది చెప్పడం వంటి వృత్తులు అంతరించిపోతున్నాయని తెలిపారు. తిరుపతి జిల్లా లో ఎరుకల సామాజిక వర్గానికి కాని వారికి ఎరు కుల కులస్తులుగా ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి అర్హులైన వారికి మాత్రమే ఎరుకుల కులస్తులుగా సర్టిఫికెట్లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.హరినాథ్, ఏకలవ్య ఎరుకల సంక్షేమ సంఘం నాయకులు ఈశ్వరమ్మ, చీరాల య్య, మునిస్వామి, వెంకటరమణ, పాల్గొన్నారు.

అమరజీవి త్యాగం అజరామరం

- పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినోత్సవం



మాట్లాడుతున్న జేసీ కార్తీక్

నెల్లూరురూరల్: ఆంధ్రరాష్ట్ర సాధనకు తన ప్రాణాలను పణంగా పెట్టి ఆత్మార్పణం చేసుకున్న పొట్టిశ్రీరాములు త్యాగాలు రాష్ట్ర చరిత్రలో అజరామరంగా నిలిచి ఉంటాయని జేసీ కె కార్తీక్ అన్నారు. ఆదివారం ఉదయం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆత్మార్పణ దినోత్సవాన్ని నిర్వహించారు. జేసీ కార్తీక్, డీఆర్‌ఓ ఉదయభాస్కరరావు, పలువురు జిల్లా అధికారులు శ్రీరాములు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. తొలుత పొట్టి శ్రీరాములు జీవిత చరిత్ర, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం అమరజీవి చేపట్టిన నిరాహారదీక్ష, స్వాతంత్ర్య సంగ్రామంలో పొట్టి శ్రీరాములు పాత్ర తదితర అంశాలతో సమాచార, పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన ప్రత్యేక వీడియోను జాయింట్ కలెక్టర్, అధికారులు ఆసక్తిగా తిలకించారు. జేసీ మాట్లాడుతూ రాష్ట్ర అవతరణకు, దేశ స్వాతంత్ర్య సమరంలో ఆ మహనీయుని సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన ఈ జిల్లా వాసి కావడం, మనందరికి గర్వకారణమన్నారు. సోషల్ వెల్ఫేర్ డీడీ శ్రీనివాసులు విద్యార్థులతో కలిసి ఆలపించిన 'పుణ్యభూమి నా దేశం నమో నమామి.. ధన్యభూమి నా దేశం సదా స్మరామి' దేశభక్తి గీతానికి కరతాళ ధ్వనులు ప్రతిధ్వనించాయి. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ ఉదయభాస్కరరావు, బీసీ సంక్షేమ అధికారి ప్రసూన, సోషల్ వెల్ఫేర్ డీడీ శ్రీనివాసులు, సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి, సమాచారశాఖ సహాయ ఇంజినీర్ ఏ కిశోర్, ఆత్మకూరు డిప్యూటీ డీఈఓ ఎంవీ జానకీరాం, ఎంఈఓ మురళీధర్, బీసీ సంక్షేమ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్



800 మీటర్ల పరుగు పందెం పురుషుల విభాగంలో విజేతలు



800 మీటర్ల పరుగు పందెం మహిళా విభాగంలో విజేతలు



పట్టుకో.. పట్టుకో.. : కబడ్డీ ఆడుతున్న పోలీస్ సిబ్బంది

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

- పోలీసులకు వార్షిక స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్
- ప్రారంభించిన ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైమ్): నెల్లూరులోని పోలీసు కవాతు మైదానంలో జిల్లా పోలీస్ వార్షిక స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ – 2024 ఆదివారం జరిగింది. దీనిని ఎస్పీ జి.కృష్ణకాంత్ ప్రారంభించారు. బెలూన్లను గాల్లోకి ఎగురవేశారు. క్రీడా జ్యోతిని వెలిగించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నిత్యం విధి నిర్వహణలో బిజీగా ఉండే సిబ్బందిలో స్పోర్ట్స్ మీట్ మానసికోల్లాసంతోపాటు శారీరక దారుఢ్యాన్ని పెంపొందిస్తుందన్నారు. జీవితంలో క్రీడలకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అనంతరం ఎస్పీ తోటి అధికారులు, సిబ్బందితో కలిసి వాలీబాల్ ఆడి క్రీడా స్ఫూర్తిని నింపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సిబ్బంది పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. 800 మీటర్ల పరుగు పందెంలో విజేతలుగా నిలిచిన పురుష, మహిళా సిబ్బందికి ఎస్పీ మెడల్స్ అందజేశారు. నెల్లూరు నగరం, రూరల్, ఆత్మకూరు, కావలి, కందుకూరు సబ్‌డివిజన్లతోపాటు ఏఆర్, హోంగార్డ్స్ విభాగం పోలీసు అధికారులు, సిబ్బంది 100 మీటర్లు, 800 మీటర్ల పరుగు పందేలు, వాలీబాల్, షాట్‌పుట్, డిస్క్‌త్రో, లాంగ్‌జంప్ తదితర పోటీల్లో రాణించారు. కార్యక్రమంలో ఏఎస్పీలు ఏఎస్పీ హెచ్ సౌజన్య, మునిరాజ్, డీఎస్పీలు డి.శ్రీనివాసరెడ్డి, ఘట్టమనేని శ్రీనివాస్, శ్రీధర్, ఎ.శ్రీనివాసరావు, రాజగోపాల్, సీహెచ్ రామారావు, ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్, ఏపీ పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాదరావు, జిల్లాలోని సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



వాలీబాల్ ఆడుతున్న పోలీస్ సిబ్బంది



డిస్క్ ఎంత దూరం వెళ్తుందో..

క్లుప్తంగా

ప్రమాదవశాత్తు రైల్లో నుంచి పడి..

- వ్యక్తి మృతి

కోవూరు: ప్రమాదవశాత్తు రైల్లో నుంచి పడి అసోంకు చెందిన ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని పడుగుపాడు రైల్వే స్టేషన్ సమీపంలో ఆదివారం జరిగింది. కావలి జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ మనోహర్ కథనం మేరకు.. త్రిసూర్ వైపు వెళ్లే రైల్లో ప్రయాణిస్తున్న సాలెహా అహ్మద్ (32) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు జారిపడిపోవడంతో శరీరం రెండు భాగాలుగా తునాతునకలైంది. రైల్వే సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు కావలి జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కండలేరులో 56.480 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 56.480 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. వరద కాలువ ద్వారా 1,200 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. సోమశిల జలాశయం నుంచి 1,100 క్యూసెక్కుల నీరు వస్తోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 500, లోలెవల్ కాలువకు 10, హైలెవల్ కాలువకు 120, మొదటి బ్రాంచ్ కాలువకు 20 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

సైదాపురం: దళితుల భూములను ఆక్రమించుకోవడంతోపాటు దౌర్జన్యం చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు డీపీ పోలయ్య డిమాండ్ చేశారు. ఆయన ఆదివారం సైదాపురంలో విలేకరులతో మాట్లాడారు. జోగిపల్లిలో దళితులు ఎన్నో ఏళ్లగా భూములను సాగు చేసుకుంటున్నారని తెలిపారు. వాటిని ఆ గ్రామానికి చెందిన భూస్వాములు దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారని చెప్పారు. అంతేగాక దళిత మహిళపై దాడి చేశారని దుయ్యబట్టారు. వారిని అరెస్ట్ చేయాలని, లేనిపక్షంలో ఉద్యమం నిరసన తెలుపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంకయ్య, చెంగల్రావు, వేణయ్య, బాలు, మమత, రమణమ్మ, యశోదమ్మ, శారద తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయుల కన్నీటి వేదన

ఫుట్‌పాత్‌లపైనే నిద్ర

- వాన కురిస్తే పరిగెత్తాల్సిందే..
- చలికాలంలో అష్టకష్టాలు పడుతూ జీవన పోరాటం
- ఆదరించే వారు లేక మౌన రోదన
- నిరాశ్రయ కేంద్రాల ఏర్పాటులో నిర్లక్ష్యం

కావలి: రాత్రి వేళల్లో రోడ్డుపై వెళ్తూ ఫుట్‌పాత్‌ల పక్కన అనేక మంది నిద్రపోవడాన్ని చూసే ఉంటారు. వీరికి కుటుంబం ఉండదు. ఆత్మీయంగా పిలిచే వారు కరువే. చేతిలో డబ్బులుండవు. అనారోగ్యం బారిన పడితే ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకోలేని పరిస్థితి. నిరాదరణకు గురైన ఈ నిరాశ్రయులు జిల్లాలో ఎందరో ఉన్నారు. ఇంట్లో నుంచి పారిపోయి వచ్చిన వారు, కుటుంబ కలహాలు, అనారోగ్యం తదితర కారణాలతో పట్టణాలకు చేరారు. ఫుట్‌పాత్‌లు, దేవాలయాలు, ఇతర ప్రార్థనా మందిరాలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లను స్థావరాలుగా మార్చుకుని జీవనం సాగిస్తున్నారు. చిన్నపాటి పనులు చేసుకుంటూ చిరుతిళ్లతో జీవితాన్ని లాగిస్తున్న వారు కొందరైతే.. మరికొందరు భిక్షమెత్తుకుంటూ బతికేస్తున్నారు.

ఊరు	జనాభా	ఫుట్‌పాత్‌లపై ఉంటున్న వారు	ఏర్పాటు చేయాల్సిన కేంద్రాలు
నెల్లూరు	8,50,000	275 మంది	9
కావలి	2,50,000	45 మంది	3
కందుకూరు	1,50,000	30 మంది	2
ఆత్మకూరు	85,000	15 మంది	1





కావలి పట్టణంలో రోడ్డు పక్కన నిద్రిస్తున్న నిరాశ్రయులు

అవస్థలు పడుతూ..

జిల్లాలోని పట్టణాల్లో సుమారు 1,500 మందికిపైగా అనాథలు, ఎలాంటి ఆశ్రయం లేనివారు ఉన్నట్లు అంచనా. వీరి కోసం పట్టణాల్లో నిరాశ్రయ కేంద్రాలు ఏర్పాటు చేయాలనే ఆదేశాలున్నా ఎక్కడా అమలు కావడం లేదు. దీంతో ఉదయం వేళల్లో రోడ్లపై తిరుగుతుంటారు. రాత్రయితే తలదాచుకునేందుకు అనేక అవస్థలు పడుతుంటారు. చాలామంది నిద్ర కోసం బస్టాండ్లు, రైల్వేస్టేషన్లలో బెంచీలను ఆశ్రయిస్తున్న పరిస్థితులున్నాయి. ఒకవేళ అక్కడి సిబ్బంది చూస్తే వీరు మరోచోటు వెతుక్కోవాల్సిందే. ఇలాంటి వారి కోసం షెల్టర్ మేనేజ్‌మెంట్ కమిటీలు ఏర్పాటు చేయాలి. కానీ అలా చేయలేదు. ఈ కమిటీల్లో మున్సిపల్ కమిషనర్‌తోపాటు ట్రాఫిక్ పోలీస్, మెప్మా సిబ్బంది సభ్యులుగా ఉంటారు. ప్రతి లక్ష జనాభాకు ఒక నిరాశ్రయ కేంద్రాన్ని పెట్టాలి. నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్, కావలి, కందుకూరు, ఆత్మకూరు మున్సిపాలిటీల పరిధిలో సుమారు 15 వరకు ఏర్పాటు చేయాల్సి ఉంది.



కావలిలో అసంపూర్తిగా ఉన్న నిరాశ్రయ కేంద్రం

చర్యలు తీసుకుంటాం

ప్రస్తుతానికి ఆయా ప్రాంతాల్లో నిరాశ్రయులు ఎంతమంది ఉంటారనే అంశాన్ని పరిశీలిస్తున్నాం. నివేదికను ప్రభుత్వానికి పంపి నూతన కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. నెల్లూరులో 2, కందుకూరులో ఒక కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం.

– ఎ.రాధమ్మ, మెప్మా పీడీ

మొక్కుబడిగా..

రోడ్డు పక్కన నిద్రించే పేదలు, వృద్ధులు, యాచకులు పౌరులుగానే గుర్తించబడతారు. వారి కోసం రాత్రి బస కేంద్రాలు ఏర్పాటు చేయాలని దేశ సర్వోన్నత న్యాయస్థానం 2016లో చెప్పింది. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి కైలాస్ గంభీర్ కమిటీ పలు రాష్ట్రాల్లో పర్యటించి నిరాశ్రయుల స్థితిగతులపై సుప్రీంకోర్టుకు నివేదికను సమర్పించింది. దీంతోఅన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని అన్ని ప్రధాన నగరాల్లోనూ నిరాశ్రయుల కోసం వసతి కేంద్రాలు ఏర్పాటు చేసి వారికి వసతి, భోజనం, సంరక్షణ బాధ్యతలు చూడాలని సుప్రీంకోర్టు చెప్పింది. నిరాశ్రయుల కేంద్రాన్ని పట్టణ జీవనోపాధుల మిషన్ కింద నిర్వహించాలని సూచించింది. దీన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాల్సిన అధికార యంత్రాంగం మొక్కుబడిగా వ్యవహరిస్తోంది. పగలంతా పట్టెడన్నం కోసం పోరాటం, రాత్రయితే ఫుట్‌పాత్ పైనే పడక.. వాన కురిస్తే పరిగెత్తాల్సిందే. చలిగా ఉంటే గోతాన్ని కప్పుకొని వణుకుతూ కునుకు తీస్తున్న వారి కోసం కేంద్రాలను ఏర్పాటు చేస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

దర్గాలో గుర్తుతెలియని మహిళ మృతి



మహిళ మృతదేహం

అనుమసముద్రంపేట: మండల కేంద్రమైన ఏఎస్‌పేటలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన హజరత్ ఖాజానాయబ్ రసూల్ దర్గాలో ఆదివారం గుర్తుతెలియని మహిళ చనిపోయిగా ఉండగా నిర్వాహకులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్సై తన సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. మహిళ వయసు 30 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉంటుందని భావిస్తున్నారు. ఎడమ చేతిపై దమ్ము, చిట్టి అని ఇంగ్లిష్‌లో పచ్చబొట్లున్నాయి. మహిళ గురించిన సమాచారం తెలిస్తే 94407 00012, 91543 05605 నంబర్లకు ఫోన్ చేయాలని ఎస్సై కోరారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) : 108
లేయర్ (లైవ్) : 105
బ్రాయిలర్ చికెన్ : 202
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 222
లేయర్ చికెన్ : 178



నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.20
సన్నవి : రూ.15
పండ్లు : రూ. 8


చెడు వ్యసనాలకు బానిసై చోరీలు

- నిందితుడిది నెల్లూరు జిల్లా

సింగరాయకొండ: పలు చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్న నెల్లూరు జిల్లాలోని మాచవరం గ్రామానికి చెందిన అంతర్రాష్ట్ర దొంగ కట్టా మధుబాబును అదుపులోకి తీసుకున్నట్లు సీఐ సీహెచ్ హజరత్తయ్య తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆదివారం ఆయన వివరాలు వెల్లడించారు. చెడు వ్యసనాలకు బానిసైన మధుబాబు కొంతకాలంగా చోరీలకు పాల్పడుతున్నాడు. ఉదయం వేళల్లో చోరీలు చేయడం ఇతని ప్రత్యేకత. తక్కువ సమయంలోనే దొంగతనం చేసి ఘటనా స్థలం నుంచి పరారయ్యేవాడు. ఈనెల 2వ తేదీ సుందర్‌నగర్‌కు చెందిన కుంచాల సునీత సుబ్బారెడ్డి ఇంట్లో చోరీ జరిగిందని పోలీసులకు ఫిర్యాదు అందింది. కేసు దర్యాప్తులో భాగంగా డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సీఐ, ఎస్సై బి.మహేంద్రలతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఆదివారం నిందితుడిని కందుకూరు ఫ్లై ఓవర్ దగ్గర అదుపులోకి తీసుకుని రూ.6 లక్షల విలువైన బంగారు, వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. మధుబాబు తెలంగాణ రాష్ట్రంలోని సూర్యాపేట, నెల్లూరు జిల్లాలోని కందుకూరు, కందుకూరు రూరల్, గుడ్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన పలు చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు.

పెళ్లికి వెళ్తుండగా..

- డ్రైవర్ నిర్లక్ష్యంతో కాలువలోకి దూసుకెళ్లిన ట్రాక్టర్
- మహిళ మృతి
- ఏడుగురికి గాయాలు



ఘటనా స్థలంలో ట్రాక్టర్

అల్లూరు: పెళ్లి బృందంతో బయలుదేరిన ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా కాలువలో బోల్తా పడింది. దీంతో ఓ మహిళ మృతిచెందగా ఏడుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని ఉడ్‌హౌస్‌పేట – తిప్ప మార్గంలో అల్లిమడుగు చీలిక రోడ్డు వద్ద ఆదివారం తెల్లవారుజామున జరిగింది. ఎస్సై కిశోర్‌బాబు, బాధిత కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మండలంలోని ఇస్కపల్లి దళితవాడకు చెందిన ఓ యువతి వివాహం సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులు 15 మంది ట్రాక్టర్‌లో కొండబిట్రగుంటకు బయలుదేరారు. పానిదల కామాక్షమ్మ (43) అనే మహిళ వాహనంలో ఎక్కింది. డ్రైవర్ బాబు నిర్లక్ష్యంగా, అతివేగంగా ట్రాక్టర్‌ను నడపడంతో అల్లూరు బ్రాంచ్ కాలువలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. వధువుతో సహా అందరూ అందులో పడిపోయారు. డ్రైవర్ పరారయ్యాడు. మిగిలిన వారు ఒకరికొకరు సహకరించుకుంటూ బయటకు వచ్చారు. ఏడుగురు స్వల్పంగా గాయపడ్డారు. కామాక్షమ్మ కనిపించకపోయేసరికి వెతికారు. ఆమె ట్రాక్టర్ కింద పడిపోయి మృతిచెందింది. సమాచారం అందుకున్న తిప్ప పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అల్లూరు పరిధిలో జరిగిన ఘటన కావడంతో స్థానిక ఎస్సై కిశోర్‌బాబు దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

- కామాక్షమ్మ ఇస్కపల్లి పంచాయతీలో స్వీపర్‌గా పనిచేస్తోంది. ఆమెకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. భర్త కొన్నేళ్ల క్రితం మృతిచెందాడు. ప్రస్తుతం కుమారుడి వద్ద ఉంటోంది. పెళ్లికి బయలుదేరిన కామాక్షమ్మ కానరాని లోకాలకు వెళ్లడంతో కుటుంబ సభ్యులు రోదనలు మిన్నంటాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



కామాక్షమ్మ మృతదేహం (ఇన్‌సెట్‌లో) కామాక్షమ్మ (ఫైల్)

పల్లె ప్రగతికి పచ్చ అడ్డంకులు

సమస్యల పరిష్కారానికి సచివాలయాలు

- అన్నదాతల కోసం ఆర్బీకేలు
- ప్రజారోగ్యానికి హెల్త్ క్లినిక్‌లు నాడు ఏర్పాటు
- వీటికి భవనాల నిర్మాణంపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం

గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనిచేసింది. మండల, జిల్లా కేంద్రాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేసింది. ఊరూరా ప్రత్యేక భవన నిర్మాణాలు చేపట్టింది. చాలావరకు పూర్తి చేసి వినియోగంలోకి తెచ్చింది. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మిగిలినవి పూర్తి చేసే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది.

– నెల్లూరు(పొగతోట)

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జిల్లా వ్యాప్తంగా 318 సచివాలయాలు, 153 హెల్త్ క్లినిక్‌లు, 258 రైతు భరోసా కేంద్రాలు, 11 బల్క్ మిల్క్ సెంటర్ల నిర్మాణాలు పూర్తయ్యాయి.
- 108 సచివాలయాలు, 102 హెల్త్ క్లినిక్‌లు, 69 ఆర్బీకేలు, 38 బల్క్ మిల్క్ సెంటర్ల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి.
- 118 గ్రామ సచివాలయాలు, 200 హెల్త్ క్లినిక్‌లు, 214 ఆర్బీకేలు, 37 బల్క్ మిల్క్ సెంటర్ల నిర్మాణాలను కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదు.
- ఆర్బీకేల ద్వారా సాగులో సరికొత్త అధ్యాయానికి నాడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. విత్తు నుంచి పంట ఉత్పత్తుల విక్రయం వరకు ఇవి అన్నదాతలకు అండగా నిలిచాయి. సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు అందాయి. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న ఆర్బీకేల నిర్మాణాలపై నాడు ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. 258 భవనాలను పూర్తి చేశారు. కూటమి ప్రభుత్వంలో వీటికి బ్రేకులు పడ్డాయి.



కలువాయి మండలం వెంకటరెడ్డిపల్లెలో అసంపూర్తిగా ఉన్న ఆర్బీకే

- నిధులు విడుదల చేయకపోవడంతో భవన నిర్మాణాలను చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. బిల్లులు చెల్లించకపోవడంతో గతంలో మొదలైన నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి.
- త్వరితగతిన వీటిని పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావడం ద్వారా మెరుగైన సేవలందించేందుకు కూటమి ప్రభుత్వం చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం



గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు తదితర ప్రాధాన్యతా భవనాల నిర్మాణాలను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలను పూర్తి చేసేలా దృష్టి సారిస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల చర్యలు చేపడతాం.

– అశోక్‌కుమార్, పంచాయతీరాజ్ ఎస్ఈ